క్లుప్తంగా

25న చలో గుంటూరు

వీరఘట్టం: ఉపాధ్యాయుల గుండె చప్పుడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు యూటీఎఫ్ రణభేరి ద్వారా సమర శంఖారావాన్ని పూరించింది. ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 25న చలో గుంటూరుకు పిలుపునిచ్చింది. ఈ మేరకు మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించని ఎడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. చలో గుంటూరును విజయవంతం చేయాలని కోరారు.

చినమేరంగిలో వైద్యశిబిరం

జియ్యమ్మవలస రూరల్: ప్రధాని మోదీ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు వాడవాడలా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చినమేరంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌కే చైతన్య తెలిపారు. ఇందులో భాగంగా చినమేరింగిలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండెపోటు, క్యాన్సర్, కిడ్నీ సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పూర్ణచంద్రిక, డాక్టర్ రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు


పీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించని ఎడల సమ్మెబాట చేపట్టక తప్పదని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను అతని కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం, ప్రమోషన్లు కల్పించడం, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ట్రైబల్ అలవెన్సు మంజూరు చేయాలన్నారు. అలాగే చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాంలో పాల్గొనే వైద్యులకు రూ.5 వేల అలవెన్సులు చెల్లించాలన్నారు. కచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానుప్రతాప్, చాందిని, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వారి స్వగృహానికి ఇటీవల విచ్చేసిన గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు.

శిఖరాగ్ర సభలో మన్యం ఉపాధ్యాయుడు

కొమరాడ: న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన 89వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ జనరల్ సమావేశంలో కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన గంట సోమశేఖర్‌రావు పాల్గొన్నారు. ఆయన సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలలో బయలాజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్స్(బీఐఎస్) వస్తువుల నాణ్యత ప్రమాణాల్లో లోపాలపై ఎక్కడ ఫిర్యాదుచేయాలి, వస్తువు నాణ్యత ఎలా పరిశీలించాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో సదస్సులో పాల్గొనే అవకాశం లభించిందన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై రగడ

పాచిపెంట: మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న ప్రజా మరుగుదొడ్లుపై ఆక్రమణలో చెరువులు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితం కావడంతో స్థానికులు స్పందించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా మరుగుదొడ్లు ప్రజా వినియోగానికి అనుకూలంగా నిర్మాణం చేపట్టాలని, అలా కాకుండా చెరువు గర్భాల్లో, బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. చెరువు గర్భంలో నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్‌లో చెరువుకు వరద నీరు ఎక్కువగా వస్తే ఆ నీటిలో కలిసి పోతాయన్నారు. బైపాస్ రోడ్డు పక్కన నిర్మాణం చేపడుతున్న మరుగుదొడ్లు రోడ్డు విస్తరణ పనులు చేపడితే వాటిని తొలగించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తద్వారా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ప్రజలకు అనువైన చోట నిర్మాణాలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఊర చెరువు ఆక్రమణలకు గురవుతుందని సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెరువును పరిరక్షించాలని ఆయన కోరారు.


పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ దండి ఏడుకొండలు


గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం


పాలకొండ రూరల్: నక్కలపేటలో కొలువు తీరిన అష్టాదశ శక్తి పీఠాలు

జగన్మాతా నమోస్తుతే..!

- పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నక్కలపేటలో అష్టాదశ శక్తి పీఠాలు

పాలకొండ రూరల్: భక్తుల పాలిట కొంగు బంగారమైన పురటాల పోలమాంబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉదయం 5 గటంల నుంచి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ఉత్సవ మూహూర్తపు రాట వేశారు. అర్చకుడు వేమకోటి రవిశర్మ నేతృత్వంలో కలశస్థాపన, అఖండ దీపారాధన చేపట్టారు. అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో నాగవంశీకులు పోలమాంబకు సామూహిక పూజలు చేపట్టారు. అలాగే నక్కలపేట షిర్డీ సాయి సకల దేవతా మందిరంలో అష్టాదశ శక్తి పీఠాలను ప్రతిష్ఠించారు. అర్చకుడు పత్రి శరత్‌కుమార్ నేతృత్వంలో స్వయంశక్తి స్వరూపిణులకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాయుడు కోనేటి గట్టుపై కొలువైన ముగ్గురమ్మలకు.. నీలమాంబ ఆలయాల్లో కూడా విశేష పూజలు జరిగాయి.

తల్లీ చల్లంగ చూడమ్మ

వీరఘట్టం: తల్లీ జగన్మాతా నమోఃనమామి.. మమ్మల్ని చల్లంగచూడమ్మా... ఆది పరాశక్తీ ఆదుకోవమ్మా అంటూ శరణుఘోషతో భక్తులు కోటదుర్గమ్మను కొలిచారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, భక్తుల పాలిట కల్పవల్లి కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు వీరఘట్టంలో కనులపండుగగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీర,జాకెట్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే కిమ్మి గ్రామంలో నాగవళి నదీతీరంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి పలువురు భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు.

భామినిలో..

భామిని: మండలంలోని బత్తిలి, కొరమ గ్రామాల్లో దుర్గాదేవి మంటపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొరమ రామమందిరంలో దుర్గామాతను ప్రతిష్ఠించారు. అలాగే బత్తిలి కోట దుర్గమ్మ సన్నిధిలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సవాలు ప్రారంభం..

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో త్రినాథస్వామి ఆలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించి, ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


భామిని: కొరమలో పూజలందుకుంటున్న దుర్గాదేవి


వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు


కురుపాం: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ కేంద్రమంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ దంపతులు

జగన్మాత అవతారం

జగన్మాత అవతారమే కోటదుర్గ. శరన్నవరాత్రుల్లో దేవీ దర్శనం చేసుకుంటే జనులందరికీ సర్వశుభాలు కలుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చె కొంగు బంగారమైన దుర్గాదేవిని దర్శించుకున్నావారికి సర్వ శుభాలు కలుగుతాయి.

– శర్మయాజీ, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం


పాలకొండ రూరల్: బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిస్తున్న పోలమాంబ


వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న వీరఘట్టం కోటదుర్గమ్మ

కోటలో దసరా ఉత్సవాలు..

కురుపాం: దసరా నవరాత్రులను పురస్కరించుకుని కేంద్ర మాజీమంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ దంపతులు కురుపాంలో గల వారి కోటలో వెలిసిన ఖడ్గదుర్గ ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు కిశోర్ చంద్రదేవ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో ఖడ్గదుర్గను పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన తప్పనిసరి

- వైద్యాధికారులు శివశంకర్, రవికుమార్

పాలకొండ రూరల్: ఆరోగ్య రక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు శివశంకర్, రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణానికి చెందిన విజయ నెట్‌వర్క్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంతకుముందు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రణస్థలం రమా రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు దోహదం..

గరుగుబిల్లి: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారి కేవీఎస్ పద్మావతి అన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు పీహెచ్‌సీ పరిధి సచివాలయాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు మండలంలోని ఉల్లిభద్రలో పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జగదీశ్వరి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, వైద్యలు, సిబ్బంది


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యారోగ్యశాఖాధికారి కేవీఎస్ పద్మావతి

నిరుద్యోగ గిరిజనుల అరెస్టు అమానుషం

సాలూరు రూరల్: మెగా డీఎస్సీ నిరుద్యోగ గిరిజనులు తమ మొర వినిపించేందుకు గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణి వద్దకు వెళ్తే వారిని అరెస్టు చేయడం అమానుషమని మండలం మెట్టవలస గ్రామానికి చెందిన మెగా డీఎస్సీ అభ్యర్థులు మర్రి సుజాత, కె.సతీష్, జేఏసీ మండల అధ్యక్షుడు నిమ్మక అన్నారావు పేర్కొన్నారు. వీరంతా విలేకరులతో సోమవారం మాట్లాడారు. జీవో నంబర్ 3, డీఎస్సీ 25పై తమకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజనులు మొరపెట్టుకొనేందుకు వెళ్తే.. పోలీసులతో అరెస్టులు చేయించిన గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణి తీరు మార్చుకోవాలన్నారు. ఒక గిరిజన మంత్రి అయి ఉండి గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించాల్సింది పోయి గిరిజన నిరుద్యోగులను నిర్లక్ష్యంగా చూశారని ఆరోపించారు. ఇలాగే మంత్రి వ్యవహార శైలి ఉంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ వలయంలో పాలకొండ


పాలకొండ - శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ దుస్థితి (ఫైల్)

- నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం
- పండగల నేపథ్యంలో మరింత రద్దీ
- చర్యలు తీసుకోకుంటే తప్పని ప్రమాదాలు

పాలకొండ రూరల్: పాలకొండ నియోజకవర్గ కేంద్రంతో పాటు వీరఘట్టం, భామిని, సీతంపేటతో మండలాల్లో కూడా వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ప్రస్తుతం దసరా పండగ నేపథ్యంలో రోడ్లన్నీ వినియోగదారులు, వాహనదారులతో కిటకిటలాడుతున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పట్టణంలో ప్రత్యామ్నాయ రహదారులు పూర్తిస్థాయిలో లేవు. రోడ్లపైకి రావాలంటే ప్రజలు హడలిపోయే స్థితి నెలకొంది. తాజాగా వీరఘట్టం రహదారిలో, పాలకొండ - రాజాం, సీతంపేట రహదారుల్లో చోటుచేసుకున్న వాహన ప్రమాదాల్లో ఒకరు మరణించగా పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాల సంఖ్య అధికంగా ఉండడం, నియోజకవర్గంలో ఎక్కడా 'వన్ వే ' లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఒక వైపు పోలీసులు, మరోవైపు మోటార్‌వెహికల్ అధికారులు పలు నియమ నిబంధనలను అమలు చేస్తున్నప్పటికీ వారు ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో నియోజకవర్గ పరిధిలో ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు పరిపాటిగా మారాయి.

కుచించుకుపోయిన రోడ్లు..

పాలకొండ పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. రోడ్ల నిర్వహణ విషయంలో కూటమి సర్కార్ అవసరమైన చర్యలు చేపట్టకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక వీరఘట్టం జంక్షన్ మొదలుకుని ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. దీంతో ఒకే రహదారిపై అన్ని స్థాయిల వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. నాలుగు మండలాల పరిధిలో 60 అడుగుల రహదారులకు ఇరువైపులా తాత్కాలిక ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గి రోడ్లు 40 అడుగులకు కుచించుకుపోయాయి. ప్రస్తుత పండగల నేపథ్యంలో ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో ఉన్న రహదారి కాస్తా మరింత ఇరుగ్గా మారింది. ఇదిలా ఉంటే రహదరుల విస్తరణ చేపడతామన్న అధికారులు గడిచిన కొద్ది రోజులుగా ఎటువంటి చర్యలు చేపట్టక పోగా.. ఉన్న రహదారి సమస్యలను పరిష్కరించడం లేదు. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో వాహనాలతో రోడ్డుమీదకు రావాలంటే ఆలోంచించాల్సిన స్థితి నెలకొంది.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



ట్రాఫిక్ నియంత్రణకు బ్లూ కోల్ట్, సీపీఓ వ్యవస్థను అమలు చేస్తున్నాం. రక్షక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చాం. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నాం. పండగలను దృష్టిలో పెట్టుకుని సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఉన్న సిబ్బందిలో అధిక శాతం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నియమిస్తున్నాం. – ఎం.రాంబాబు, డీఎస్పీ పాలకొండ

పార్కింగ్ ప్రదేశాలు ఎక్కడ..?

ప్రధాన రహదారులు, వర్తక సముదాయాల వద్ద పార్కింగ్ ప్రదేశాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి నిబంధనలను వాహనచోదకులు పాటించకపోవటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పండగలు, పబ్బాలు వస్తే పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. దీంతోపాటు పాలకొండ - వీరఘట్టం, విశాఖ, శ్రీకాకుళం ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణల కారణంగా రహదారి పూర్తిగా రూపుకోల్పోయింది. ముఖ్యంగా మండల కేంద్రాల్లో ప్రధాన రహదారికి ఇరువైపుల వ్యాపారాలు, రోడ్లపై చిరు దుకాణాలు, తోపుడు బళ్ల వ్యాపారుల సంఖ్య పెరగడంతో ఉన్న కాస్త రహదారి కుచించుకుపోయింది. భారీ వాహనాలు వచ్చేటప్పుడు ట్రాఫిక్‌కు గంటల తరబడి ఇబ్బంది కలుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలకు వచ్చి, వెళ్లే విద్యార్థులతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. వీరు తమ గమ్యస్థానాలు చేరే క్రమంలో బస్సులపై ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అనిల్, గంగారావు

గుమ్మలక్ష్మీపురం: పెండిగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు బి.అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక గిరిజన సంఘ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సాక్షాత్తూ యూనివర్సిటీల్లో కూడా ఫీజులు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని తెగేసి చెబుతుండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి మొద్దునిద్ర వీడి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం పిలుపు మేరకు సోమవారం నుంచి చేపడుతున్న నిరవధిక బంద్‌కు ఎస్ఎఫ్ఐ మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


టిక్కబాయిలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ పోషణ మాసం అవగాహన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్.గౌరమ్మ, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని టిక్కబాయి అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ సిబ్బంది ర్యాలీ


పట్టణంలో స్వచ్ఛ ఉత్సవ్ ర్యాలీ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

పాలకొండ రూరల్: స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని పోస్టల్ ఉద్యోగులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంతో పాటు ప్రధాన మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత వలన కలిగే ఆరగ్యో ప్రయోజనాలు గుర్తించాలని సహాయ పోస్టల్ అధికారి ఎస్‌కే సేథు అన్నారు. ఈయన వెంట సిబ్బంది రమణ, శ్రావణ్, ప్రసాద్ దాస్, శ్రీను, మురళి, సూర్య, తదితరులున్నారు.

రోడ్డు నిర్మించండి


గ్రామాలకు రోడ్డు నిర్మించాలని నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: గిరి శిఖర గ్రామాలైన వామాసీ, శిఖరపాయి గ్రామాలకు రోడ్లు నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు ఎం.సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘ నాయకులు సోమవారం ఆయా గ్రామాలను సందర్శించి, రహదారి ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరి శిఖర గ్రామాలకు నేటికీ రోడ్డు సదుపాయం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలు తప్పడం లేదన్నారు. అటవీ ఫలసాయాలు విక్రయించేందుకు వెళ్లాలన్నా.. కొనుగోలు చేసిన నిత్యావసర సరుకులు తీసుకురావాలన్నా గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు కలుగజేసుకుని రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

వైద్య క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే వైద్య క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఈ తరహా క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. 369 మంది రోగులను పరీక్షించడంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించి, 36 యూనిట్ల రక్తం సేకరించినట్లు చెప్పారు.

సంతలో వైద్యశిబిరం..

స్థానిక వారపు సంతలో వైద్యశాఖ ఏర్పాటు చేసిన శిబిరాన్ని పీఓ పరిశీలించారు. సంతకు వచ్చే గిరిజనులకు ఈ వైద్యం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అవసరమైన రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. మండలంలోని అన్ని వారపు సంతల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు.

ఎఫ్‌పీఓలకు సలహాలు అందించండి

- డిజిటల్ ఫౌండేషన్ స్టేట్ డైరెక్టర్ కమలాకర్


మాట్లాడుతున్న స్టేట్ డైరెక్టర్ కమలాకర్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఉత్పత్తిదారులకు సలహాలు అందించాల్సిన బాధ్యత డిజిటల్ ఫౌండేషన్ స్టేట్ డైరెక్టర్ కమలాకర్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్‌లో రైతు సంఘాలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌పీఓలకు అవసరమైన సాంకేతిక సలహాలను ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసే చిరుధాన్యాలు, తృణధాన్యాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి. పారినాయుడు, ప్రహర్‌రాజు, శిక్షకులు గిరిబాబు, నూకంనాయుడు, పి.మురళీ, డి. వెంకటనాయుడు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శన

కురుపాం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ. అప్పలస్వామి, తదతరులు డి. ములగ, అడ్డాపుశీల, గంగిరేగువలస, పెద్ద మేరంగి గ్రామాల్లో సోమవారం పర్యటించి, వరి, అరటి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ధ్రువ, ఎస్. శ్రీనివాసరాజు, ఎస్. స్రవంతి, డాక్టర్. జి. అమృతవీణ, డాక్టర్ ఎం. విహారి పాల్గొన్నారు.